# మా పెళ్ళి పుస్తకం



ఇన్ని పెళ్ళికథలు చెప్పినదాన్ని మా పెళ్ళి కథ చెప్పకుండా ఎలా వుంటాను? అయినా ఆ కథ నేను చెప్పకపోతే మీ అందరికీ ఎలా తెలుస్తుందీ! మా అమ్మా లేదు. అత్తగారూ లేరు. ఇక నేనేది చెప్తే అదే ఖాయం! కానీ భయపడకండి. సాధ్యమైనంతవరకూ అన్నీ నిజాలే చెప్తాను. అయితే అన్ని నిజాలూ చెప్పను.

బాగుండదు కదా! అందుకే ప్రథమాధ్యాయం నించి కాస్త సవిస్తరంగా చెబుతా. తప్పదు అవధరించాల్సిందే. ఈ కథా కాలంనాటికి నేను అప్పుడే ఎమ్మెస్సీ పరీక్షలు రాసి ఏడాది తర్వాత ఇంటికి వచ్చాను. మా చెల్లెలు చిన్నారి విశాఖపట్నంలో మా మామయ్య ఇంట్లో వుండి ఆంధ్రా యూనివర్సిటీలో ఎం.ఎ. చదువుతూ వుండేది. మా ఇందు మారిస్టెల్లా కాలేజీలో బి.ఎస్సీ. చదువుతుండేది. మా నాన్న వున్న పొలాలన్నీ అమ్మేసి అక్కడా అక్కడా సివిల్ కాంట్రాక్టులు చేసేవారు. నేను ఢిల్లీ నుంచి జి.టి. ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరి తెల్లవారగట్లే రైలు దిగి ఇంటికి వచ్చేటప్పటికి మా అమ్మ నా కోసం మేడమెట్లమీద ఎదురు చూస్తూ వుంది. అప్పట్లో మేము మేడమీద ఇంట్లో అద్దెకు వుండేవాళ్ళం. నన్ను చూడగానే గబగబా మెట్లు దిగుతూ "నా తల్లీ వచ్చావా!" అంటూ కావలించుకుంది. నేను నా జీవితంలో మా అమ్మని ఏ మూడూ నాలుగు సార్లో కావలించుకుని వుంటాను. ఏవిటో యీ బ్రాహ్మణ పుటక. ఒకళ్ళనొకళ్ళు ముట్టుకోం. కన్నతల్లీ తండ్రీ అయినా సరే. ఆరోజుల్లో అందరం అలాగే వుండేవాళ్ళం. ఇప్పటికీ ఆ స్పర్శ నాకు సజీవంగా వుంది. నన్ను చూసిన ఆనందంలో ఆవిడ కళ్ళమ్మట అలా నీళ్ళు కారుస్తూనే వుంది. తరవాత తెలిసింది. పది రోజుల క్రితం తనకి నా మీద పీడకల వచ్చిందిట. ఆ కల గురించి ఎవరితోనైనా చెప్పేందుకు కూడా మనసు రాక లోలోపల కుమిలిపోయిందిట.

ఇక లోపలికెళ్ళాక సందడే సందడి. మా చెల్లెళ్ళందరూ నిద్ర లేచేశారు. అందరం కలిసి మా తమ్ముణ్ణి లేపాం. వాడప్పటికి ఆరేళ్ళవాడు. వాడికి అక్కలమంతా కలిపి చేసిన గారాబం మేము మా కన్న పిల్లలకి కూడా చేయలేదు. తెల్లవారాక అందరం టిఫిన్లు తింటుండగా మా ఇందు "సుశీలా! నిన్ను మా మదర్ ప్రిన్సిపాల్ పదిన్నరకల్లా కాలేజీకి రమ్మంది" అని చెప్పింది. "ఎందుకు?" అని అడిగాను. "మొన్న కాలేజీలో లెక్చరర్ పోస్టులకి ఇంటర్వ్యూలయినప్పుడు కెమిస్ట్రీకి ఎవరూ అప్లయి చెయ్యలేదుట. అందుకే నిన్ను రమ్మంది" అని చెప్పింది. నిరుడు సెలవుల్లో వచ్చినప్పుడు నేను వాళ్ళ కాలేజీకి ఏదో పనిమీద వెళ్ళాను. మా ఇందు నన్ను ఆవిడకి పరిచయం చేసి ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఫైనలియర్ చదువుతున్నానని చెప్పింది. ఆవిడకి ఆ విషయం గుర్తున్నదన్నమాట! ఎంతైనా మదర్లు మదర్లే.

గుమ్మంలోకి వచ్చిన లక్ష్మీదేవిని అహంకారంతో కాలదన్నుకునే మూర్ఖురాలిని కాదు. చక్కగా ముస్తాబై నా ఫస్టియర్ మార్క్స్ షీట్ తీసుకుని ఇందుతో సహా కాలేజీకి వెళ్ళాను. ఇంటర్వ్యూ లేదూ, పాడూ లేదూ! తెల్లవారగట్ల మా అమ్మ నన్ను చూసి ఎంత మురిసిపోయిందో, ఆ మదర్ ప్రిన్సిపల్ కూడా అంతే ఆనందపడిపోయింది.

"మారిస్టెల్లా వెలకమ్స్ యు" అని ఆహ్వానం పలికింది.

నేనింకా పరీక్షలు మాత్రమే రాశానని పాసో ఫెయిలో తెలియదని విన్నవించుకున్నాను.

"ఏం ఫర్వాలేదు. నీ ఫస్టియర్ మార్కులు బాగున్నాయి. అన్ని పేపర్లూ రాశావు కదా! చాలు. ఒక అప్లికేషన్ రాసి ఇయ్యి" అని తెల్లకాగితం నా ముందు పెట్టింది.

నేనేదో రాసి ఇవ్వగానే, ఒక బుల్లి సిస్టర్‌ని పిలిచి ఎప్పాయింట్‌మెంట్ లెటర్ టైప్ చేయించి తను సంతకం చేసి నా చేతిలో పెట్టింది.

"యుకెన్ జాయిన్ నౌ" అంది.

"కానీ కాలేజీకి హాలీడేస్ కదా!" అని తప్పించుకోబోయాను.

"ఫర్వాలేదు జాయిన్ అయిపో! లాబ్ సెట్ చెయ్యాలి" అంది.

ఓ తెల్ల కాగితం తీసుకుని జాయినింగ్ రిపోర్టు రాసిచ్చాను.

"పద లాబ్ చూపిస్తాను" కొనవలసిన కెమికల్స్, ఎక్విప్‌మెంటు లిస్టు తయారు చేద్దాం!" అని వెంటనే పని అప్పచెప్పబోయింది.

"రేపు వస్తాను. ఢిల్లీ నుంచి తెల్లారగట్లేవచ్చాను. రెండ్రోజుల్నించీ కూచునే ప్రయాణం చేశాను" అని చెప్పి ఆవిడ దగ్గర సెలవు తీసుకుని నా భుజం నేనే తట్టుకుంటూ ఆనందంగా ఇల్లు చేరాను.

తర్వాత తెలిసింది అంతకు రెండు రోజుల ముందు బి.ఎస్సీ. సెకండ్ ఇయర్ రిజల్ట్స్ వచ్చాయిట. సగంమంది అమ్మాలకి కెమిస్ట్రీ పేపర్ పోయింది. వాళ్ళు అక్టోబర్‌లో అది పాస్ అయితే కానీ, ఫైనల్ ఇయర్ ఎగ్జామ్ రాసేందుకు లేదు. ఆ కాలేజీ కొత్తది. అదే ఫస్ట్‌బాచ్. అప్పటి వరకూ వాళ్ళకి దొరికిన ఎమ్మెస్సీ కెమిస్ట్రీ దాన్ని నేనొక్కదాన్నే. ఇంకొక అమెరికన్ సిస్టర్ వుండేది. ఆవిడ ఏం చదువుకుందో నాకు తెలీదు కానీ, ఆవిడ వాళ్ళకి కెమిస్ట్రీ చెప్పింది. బియస్సీ పాసయిన అమ్మాయిలిద్దరు డిమాన్‌స్ట్రేటర్లు. బోటనీ, జువాలజీ, ఫిజిక్స్‌లాంటి అన్ని సబ్జక్టులకి డిమాన్‌స్ట్రేటర్లు కూడా ఎమ్మెస్సీలే. మరి కెమిస్ట్రీ వాళ్ళకెందుకంత కరువు వచ్చిందో నాకు తెలీదు. అప్పుడప్పుడు లయోలా కాలేజి లెక్చరర్లు వచ్చి ఇక్కడ పాఠాలు చెప్పేవారు. ఏమయితేనేం నేను పరీక్ష పాస్ కూడా అవకుండానే, వూళ్లో దిగిన రోజునే, అప్లయి కూడా చెయ్యకుండా, ఇంటర్వ్యూ కూడా ఇవ్వకుండా అవలీలగా అమ్మాయిల కాలేజీలో లెక్చరర్ వుద్యోగం సంపాదించాను. "థాంక్ గాడ్, ఓ దేవుడా!

నన్ను కరుణించితివా! నీకు జయము!'' అని లోపల్లోపల నా కృతజ్ఞత ప్రకటించుకున్నాను.

ఇక మర్నాటి నుంచీ పొద్దున్నే ఎనిమిదిన్నరకి వెళ్ళడం, సాయంత్రం ఆరున్నరకి ఇల్లు చేరడం. మదరు పరీక్షతప్పిన పిల్లలందరికీ కబురు పెట్టి కాలేజీకి రప్పించి నా చేత పాఠాలు మొదలుపెట్టించింది. పదిరోజుల్లో కాలేజీ తెరిచారు. ఇక నా పని వారానికి ముప్ఫయి లెక్చర్లు, అరవై ట్యూషన్లు. అంటే పొద్దున్నే ఒకటి, సాయంత్రం ఒకటి ట్యుటోరియల్ క్లాసు. నెలకి పిల్లకి ఇరవై రూపాయలు ఫీజు. అందులో పది నాకు. పది కాలేజికి. ఆ విధంగా కాలేజీలోనే వెయ్యిరూపాయలు వచ్చేది. అది శ్రీమంతుల పిల్లలు చదివే కాలేజీ. కొంతమంది తెల్లావారగట్లే మా యింటికి పడవకార్లలో వచ్చి చదువుకునేవారు. నాకు పొద్దున్న పూట క్షణం తీరుబడి వుండేది కాదు. కొత్తగా పాసయ్యాను కాబట్టి సబ్జక్టు నోటి చివర వుండేది కానీ, పాఠం చెప్పడం రాదు కదా! ఒక్క క్లాసులో ఛాప్టరంతా అవగొట్టేదాన్ని. పిల్లలంతా నా స్పీడుకి తట్టుకోలేకపోతుంటే లెసన్ ప్లానింగ్ అంతా మా ప్రిన్సిపాలే నేర్పింది. రోజుకి రెండుమూడు పేజీలు చెప్తే చాలని, అదే రాసి ఒకసారి, వాళ్ళచేత చెప్పించి ఒకసారి టైమ్ గడపాలని నేర్పింది. అప్పటికి నాకు హైరానా తగ్గి ప్రాణం తేలిక పడింది.

మా వీధిలో వున్న ఆడపిల్లలందరితో కలిసి ఫస్ట్ ట్రిప్‌లో కాలేజీ బస్సులో వెళ్ళడం, రెండో ట్రిప్పులో లేటుగా ఇంటికి చేరడం. కాలేజీ నుంచి కొంచెం పెందరాళే వస్తే నాలుగు అడుగులు ముందు దిగి కందుకూరి రామభద్రరావుగారింట్లో కూచునేదాన్ని. ఆయన అప్పుడు ఆలిండియా రేడియోలో పనిచేస్తూ వుండేవారు. నన్ను చూడగానే అత్తయ్యగారు ఏవో ఒకటి తినేందుకు పట్టుకొచ్చి ఇచ్చేవారు. ఇంక నాకు ఇంటికెళ్ళాలన్న ధ్యాసే వుండేది కాదు. ఎందుకంటే రోజూ శ్రీరంగం గోపాలరత్నంగారు, లక్ష్మిగారు ప్రయాగ నరసింహ శాస్త్రిగారు ఎవరో ఒకరు వచ్చి కూచుని బోలెడు కబుర్లు చెప్పుకునేవారు. మధ్య మధ్యలో కవితలు చదివేవారు. కొన్నిటికి వరసలు కట్టేవారు. ప్రసారమైన కార్యక్రమాల గురించి చర్చించుకునేవారు. వాళ్ళంతా వెళ్ళాక ఇల్లుచేరేదాన్ని – "అప్పుడే వచ్చావేం ఇంకాసేపుంటే అట్నించటే కాలేజీకి వెళ్ళేపని" అంటూ అమ్మ దెప్పేది. నేను ఏనాడు ఆవిడ మాట విన్నాను గనక! అక్కడ ఈ కాలక్షేపం ఒక్కటే కాదు. వాళ్ళ పిల్లలు రాజు, లక్ష్మి, బేబి నాకు మంచి ఫ్రెండ్సు. ఎవరూ రాని పూట మేమందరం కలిసి కబుర్లు చెప్పుకునేవాళ్ళం.

నా అదృష్టం పండింది. సెకండియర్ కెమిస్ట్రీ తప్పిన స్టూడెంట్లంతా అక్టోబరు పరీక్షల్లో మంచి మార్కులతో పాసయ్యారు. మా మదర్ చాలా సంతోషించింది.

ఇప్పటి సంగతి నాకు తెలీదు కానీ, ఆరోజుల్లో మా మదర్ చీటికీ మాటికీ లయోలా కాలేజీకి వెళ్ళివస్తుండేది. ఒకరోజు నన్ను పిలిచి నా బయోడేటా జాతకంతో సహా అడిగింది. ఆవిడకి నేను ఎక్కడ పెళ్ళి చేసుకుని దూరం వెళ్ళిపోతానో అనే భయం. లయోలా కాలేజీలో బ్రాహ్మల కుర్రాళ్ళెవరన్నా పెళ్ళికానివాళ్ళు వున్నారేమోనని ఎంక్వరీ చేసిందిట. ఈ సిస్టర్లెంతకైనా తగుదురు కదా! వీళ్ళకొచ్చిన పాటి ఆలోచనన్నా మా నాన్నకి రాదేమిటో దేవుడా!

ఒక ఆదివారం నాడు అందరం తీరుబడిగా వీధివరండాలో తలా ఒక పద్ధతిగా కూర్చున్నాం. మా నాన్న నేలంతా పేపరు పరుచుకుని చదువుతున్నారు. ఆయనకదే అలవాటు. మా నాన్నెక్కడుంటే అక్కడికి పిలుపువేటు దూరంలో మా అమ్మ కూర్చుని కూరలు తరుక్కుంటుంది. నా చిన్నప్పటి నుంచీ ఆవిడకదే అలవాటు.

నేను "నాన్నా! నాన్నోయ్! మిమ్మల్నే!" అని పిలిచాను. అలా పదిసార్లు పిలిచాక పలికారు.

"అబ్బబ్బ! ఏమిటే నీగోల. ఇప్పటి దాకా మీ అమ్మతో పడ్డాను. ఇప్పుడు నువ్వు మొదలెట్టావా?" అన్నారు.

"నాన్నా! నాకెన్నేళ్ళు?"

"సోదికెళ్ళడుగు."

"లేదు మీరు చెప్పండి!"

"పదిహేడో పద్దెనిమిదో! ఎక్కడో టీచరుద్యోగం చేస్తున్నావుగా!"

"అది మూడోదాని వయస్సు" అమ్మ గొంతు వినపడింది.

"నాన్నా! నేను టీచర్ని కాదు. లెక్చరర్ని! పదేహేడేళ్ళవాళ్ళు లెక్చరర్లవుతారా?"

"పోన్లే పాతికనుకో!"

"అమ్మా! చూడవే ఎలా విసిగిస్తున్నారో! అసలు మీలాటి వాళ్ళకి నేనెలా పుట్టానో?"

"అవునూ! డేటాఫ్ బర్త్ చూసుకుంటే సరిపోయేదానికి నన్నెందుకు వేధిస్తున్నావ్?".

"నాకు ఇరవయ్యేళ్ళు నిండిపోయాయి. ఆ మధ్య పుట్టినరోజు కూడా చేసుకున్నాను. మొన్న నరసు బామ్మగారు బుజ్జిని చూసి – ఏమే మిడిసి పడిపోతున్నావు? మా మనవడిని చేసుకుంటావా? – అని అడిగితే ఇదేమందో తెలుసా? – అప్పుడే ఎక్కడ

బామ్మగారూ! మా ముగ్గురక్కలకి పెళ్ళిళ్ళయేటప్పటికి నేను ముసల్దాన్నయిపోతా-" అంది.

"ఈ కథంతా దేనికి? నన్నేం చెయ్యమంటావు? ముందు దాని పెళ్ళి చెయ్యమంటావా?"

"ఇంకా అర్థం కాలేదా అయ్యగారికి? సంబంధాలు చూడమంటోంది మీ అమ్మాయి. ఆడపిల్ల అంతకన్నా ఏం చెప్తుంది? నా ఖర్మ!" అంటూ మా అమ్మ తలపట్టుకుంది.

"మొన్న సూరీడు వచ్చి వీళ్ళ జాతకాలు చూసి ఏం చెప్పాడు? వెంకటేశూ నీ జాతకం సంగతెందుకు గానీ, నీ పిల్లలవి బ్రహ్మాండంగా వున్నాయిరా! ఎవడో ఒకడు వచ్చి అడిగి మరీ చేసుకుంటాడు అనలేదూ! మనమెందుకు కంగారు పడడం? అవునే మీ కాలేజీలో ఎవరూ లేరా?"

"అది ఆడపిల్లల కాలేజీ నాన్నా? మగ పురుగు కూడా కనపడదు".

"సర్లే చూద్దాం! ఎవరో ఒక పురుగును వెతికి పట్టుకుందాం".

ఇంత సంభాషణ జరుగుతున్నా మా నాన్న పేపర్లోంచి ముఖం పైకి ఎత్తనేలేదు. మా అమ్మకి కోపం వచ్చి కత్తిపీట, కూరలు తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది. మీకన్నా వాళ్ళ సిస్టరే నయం అంటూ...!

ఎవరి ప్రయత్నమో ఏమో తెలియదు గానీ, ఒక పెళ్ళిళ్ళ పేరయ్య ఎవరిదో అడ్రసు పట్టుకొచ్చి మా నాన్నకిచ్చాడు. ఆ అబ్బాయి భాక్రానంగల్‌లో ఇంజనీరుట. వాళ్ళ సొంత వూరు పిఠాపురం. తండ్రి టీచరు. ఆరుగురు కొడుకులు, వగైరా పెద్ద కుటుంబం. నాకు బెంగాలీ సినిమాల్లో లాగా పెద్ద కుటుంబంలోకి వదినగా వెళ్ళి, అందరిచేతా వదినా! వదినా! అని పిలిపించుకుంటూ, కాళ్ళకి దణ్ణాలు పెట్టించుకోవడం ఇష్టమే కానీ, సివిల్ ఇంజనీర్లతో అస్సలు కుదరదు. వాళ్ళకి చీటికీ మాటికీ ట్రాన్స్ఫర్లుంటాయి. దాంతో నా ఉద్యోగం అటకెక్కాల్సిందే.

"సివిల్ ఇంజనీరింగ్ వాళ్ళొద్దునాన్నా! "

"ఏం వాళ్ళకేమయిందే? నన్ను చూడు ఎంత దర్జాగా వున్నానో!"

"అందుకే మిమ్మల్ని చూస్తున్నాగా! చాలు. వాళ్ళతో తూగలేమని చెప్పేయండి".

కొన్నాళ్ళుపోయాక ఇంకో సంబంధం వచ్చింది. ఆ అబ్బాయి దత్తుడు. చాలా

ఆస్తిపరులు. ఐఐటిలో ప్రొఫెసరు. ఫర్వాలేదనిపించింది. మా తాతగారికి జాతకం పంపించింది మా అమ్మ. నిజానికి మా అమ్మకీ నాన్నకీ ఏ నమ్మకాలూ లేవు. అలాగని కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు, రాయిస్టులు కాదు. ఊరికే అలా మామూలు జనాల్లా వుంటారు. కానీ మా తాతగారికి జాతకాలంటే చాలా నమ్మకం. తనకి నచ్చిన జాతకం వున్నవాళ్ళతోటే ఆయన మాట్లాడేవారు. మనవలూ మనవరాళ్ళలో కూడా జాతకాలని బట్టి పక్షపాతం చూపేవారు. మా తాతగారు ఆ పెళ్ళికొడుకు జాతకం చూసి, "పనికిరాదు. ఈ కుర్రవాడికి ద్వితీయం వుంది" అని మానాన్నకి రాశారు. ఆ తర్వాత బాంబేలో ఒక పెద్ద డాక్టరు సంబంధం వచ్చింది. అతనికీ ద్వితీయం వుంది వల్లకాదన్నారు. నాకు ఒళ్ళుమండి మా తాతగారికి "ఇలా వచ్చిన ప్రతి పెళ్ళికొడుక్కీ ద్వితీయం వుందని వంక పెడుతున్నారు. అసలు నేను పెళ్ళి చేసుకోవడం మీకిష్టం లేదా! మీ మనసులో ఏముందో చెప్పండి!" అని ఉత్తరం రాశాను. ఆయన "నా బంగారు తల్లీ! నీకేవిటే నూరేళ్ళు లక్షణంగా వుంటావు. వస్తాడు! వస్తాడు! మళ్ళీ ఏడాది ఈ పాటికి నీ పెళ్ళయిపోతుంది. కాస్త మీ నాన్నని అదిలిస్తూ వుండు" అని జవాబు రాశారు.

ఆ తరువాత ఐపిఎస్ వాళ్ళవి, ఆర్మీ వాళ్ళవి సంబంధాలు వచ్చాయి. నాకు వాళ్లంటే చచ్చేభయం. ఆ లైఫ్ స్టైల్ తట్టుకోలేను. అలాగే బాగా డబ్బున్నవాళ్లన్నా భయం. వాళ్లకి గర్వాలని నా నమ్మకం. పైగా వాళ్లకి కట్నాలివ్వాలి. అదీ నాకిష్టంలేదు. అంతవరకు నేను పైకి ఎవరికీ చెప్పలేదు కానీ కట్నం తీసుకునేవాడిని చేసుకోకూడదని నాలో నేను నిశ్చయించుకున్నాను. ఒకవేళ ఎవరన్నా అడిగినా మా దగ్గర పెద్దగా ఏమీ లేదని అమ్మేందుకు ఆస్తులు మిగల్లేదనీ మా గురించి నాకు క్లియర్ పిక్చర్ వుండేది. ఇక నేను కూడా నా జాతకబలాన్నే నమ్ముకుని మంచిరోజు కోసం ఎదురు చూస్తూ ఒళ్ళు దగ్గిర పెట్టుకుని వుద్యోగం చేసుకునేదాన్ని.

పాపం పెళ్ళిళ్ళ పేరయ్యగారు రకరకాల సంబంధాలు తెచ్చేవారు. నాకు విసుగుపుట్టి ఎవడైనా కెమిస్ట్రీ చదువుకున్నవాణ్ణి చూడమని చెప్పాను. ఇంతలోకీ మా ఇంటికి మా నాన్నకి స్వయానా మేనమామ కూతురు, ఆవిడ భర్తా అవనిగడ్డ నుండి వచ్చారు. ఆయన అక్కడ స్టేట్‌బ్యాంక్‌లో మానేజర్‌గా పనిచేసేవారు. ఇంట్లో అటూ ఇటూ తిరుగుతున్న మా నలుగురినీ చూసి మా పిన్ని "ఏం సరోజమ్మా! ఇంకా అందర్నీ ఇంట్లో పెట్టుకు కూర్చున్నావేమిటి ఒక్కొక్కళ్ళనే గుమ్మం దాటించక! మా బావ ఏం చేస్తున్నాడు?" అని అడిగింది. "నా తల్లే అలా అడుగు మీ బావని. చెప్పి చెప్పి నా నోరు పడిపోతోంది" అంటూ ఆవిడని ఉసిగొల్పింది.

"ఏం బావా! ఎప్పుడు మాకు పెళ్ళి భోజనాలు!" అని అడిగింది.

"ఏం చెయ్యడమే! పిల్ల ఏవరేజ్! ఎవరికీ నచ్చట్లేదు" అన్నారు నాన్న న వ్వుతూ.

నాకు ఒళ్ళు మండిపోయింది. "పిన్నీ! నాన్ననే అడుగు ఇప్పటికి ఎన్ని పెళ్ళిచూపులు చూపించారో! ఇదిగో ఇలాగే పెళ్ళివారికి రాసే ప్రతి ఉత్తరంలోనూ పిల్ల ఏవరేజ్ అని పనిగట్టుకు రాస్తారు. ఇంక ఎవరైనా పెళ్ళిచూపులకి ఎందుకు వస్తారు? నేను ఏవరేజా? నిజం చెప్పు" అన్నాను.

"దీనికి గోరోజనానికి ఏం తక్కువ లేదే! ఇంజనీరు, డాక్టరు, లాయరు, పోలీసు, ఆర్మీ వాళ్ళు ఎవరూ పనికిరారుట. డబ్బున్న వాళ్ళు అసలే వద్దట. కెమిస్ట్రీ చదువుకున్నవాళ్ళు కావాలిట. లెక్చరర్ అయితే మరీ మంచిదిట" అన్నారు నాన్న.

"అవును పిన్నీ! కెమిస్ట్రీవాళ్ళు మంచివాళ్ళు. లేనిపోని గర్వాలుండవు. కట్నాలడగరు. నాకు ఒక్క కెమిస్ట్రీ సంబంధం కూడా తేలేదు. అసలు నాన్నకి బద్ధకం పిన్నీ! పైగా లేనిపోని కబుర్లు చెప్తారు" అన్నా.

మా పిన్ని ఏమీ మాట్లాడకుండా వుండిపోయింది.

ఒక పదిరోజుల తర్వాత మా పిన్నీ, బాబాయిగారు నాన్నకి ఉత్తరం రాశారు. వాళ్ళ ఇల్లుగలవాళ్ళ అబ్బాయి బొంబాయిలో కెమికల్ టెక్నాలజీ చదివి పూణేలో పై డిగ్రీ కోసం రిసర్చ్ చేస్తున్నాడట. ఒక్కడే కొడుకు. తండ్రి లేడు. తెల్లగా బాగానే వున్నాడు కానీ పెద్ద ఎత్తరి కాదు. అభ్యంతరం లేకపోతే మాట్లాడతామని రాశారు. బాబాయిగారి దగ్గర నుంచి వుత్తరం వచ్చాక నాన్నా, అమ్మా ఇద్దరూ వెళ్ళి నా జాతకం ఫోటో ఇచ్చివచ్చారు. పెళ్ళికొడుకు పెత్తల్లి పోతరాజు శారదాంబగారు ఆ వూర్లో మంచి పేరుపడ్డ సంపన్నురాలు. మా వాళ్ళు పిల్లనిస్తామని వెళ్ళినప్పుడే ఇంట్లో పెద్ద హడావుడి చేశారుట. ఆవిడకి అన్నీ సరదాలు. కొంచెం అమాయకత్వం, మంచితనం పాళ్ళు కూడా ఎక్కువే. మల్లీశ్వరి సినిమాలో ఋష్యేంద్రమణిలాగా అటూ ఇటూ పోయేవాళ్ళని కేకేసి "ఇదిగో మా రంగడికి పిల్లనిస్తామని వచ్చారు. ఆ అమ్మాయిని మహారాణీలాగా పెంచారుట, అని మా అమ్మ కళ్ళముందే చెప్పారుట. ఈ మహారాణీ లాంటి పెంపకం మాటలు మా అమ్మవి కాదు. మంచి మాటకారి అయిన మా పిన్నివి. అందులో అదే రోజు మధ్యాహ్నం రేడియోలో నా ప్రోగ్రాం వచ్చింది. ఆవిడ రేడియో ఫుల్ వాల్యూమ్‌లో పెట్టి ఊళ్ళో అందరికీ నా గొంతు విన్పించారట. వాళ్ళబ్బాయి వచ్చినప్పుడు చూడ్డానికి వస్తామని చెప్పారు. మా నాన్న పెళ్ళి సంబంధం కోసం ఎవరింటికైనా వెళ్ళడం అదే ప్రథమం.

నాకు డిసెంబర్ సెలవులివ్వగానే మా అక్కచెల్లెళ్ళు ముగ్గురం మా మామయ్య ఇంటికి వెళ్ళాం. అప్పుడక్కడ మా మామయ్య శ్రీశైలం ప్రాజెక్టు డైరెక్టరుగా పెద్ద వుద్యోగంలో వుండేవాడు. సాయంత్రం నాలుగయ్యేటప్పటికి కృష్ణ అవతల ఒడ్డుకి వెళ్ళే జీపులు ఎక్కి గుడిదగ్గిర దిగిపోయేవాళ్ళం. ఒక ఐదారుగురు పిల్లలం అక్కడ గుడిలో ఒక గోడలాంటి దానిమీద కూర్చుని వచ్చేపోయే భక్తుల్ని చూసేవాళ్లం. అప్పుడప్పుడు గుళ్ళో దేముణ్ణి కూడా చూసేవాళ్ళం. ఒకరోజు అలా మేం గుడిలో వుండగా మా మామయ్య డ్రైవరు వచ్చి, "అమ్మాయిగారూ మీరు అర్జంటుగా బెజవాడ వెళ్ళిపోవాలట. అయ్యగారు రమ్మన్నారు" అని చెప్పాడు. అప్పుడు గుళ్ళో హారతి జరుగుతోంది. ఒకటే శంఖ నాదాలు మంగళ వాయిద్యాలు. మళ్ళీ ఎప్పుడు వస్తామో అనుకుని దేవుడికి దణ్ణం పెట్టుకుని ఇంటికి వచ్చాం. ఇంతకీ వార్త ఏమిటంటే అవనిగడ్డ పెళ్ళివారు మర్నాడు పెళ్ళి చూపులకి వస్తారుట. కాబట్టి మమ్మల్ని బెజవాడ ఉన్నపళంగా రమ్మని నాన్న టెలిగ్రాం. నేను మా అమ్మమ్మ తాతగారికి దణ్ణం పెట్టాక "ఈ సంబంధం కుదుర్తుందే! ఏ దోషాలూ వుండవు! నువ్వు మాత్రం అడ్డాలు పెట్టకు" అని తాతగారు ఆశీర్వదించి పంపారు. ఇక్కడ నుంచీ ద్వితీయాధ్యాయం మొదలు.

మా అమ్మా, అమ్మమ్మా కూడా ఎవరికి పెళ్ళి చూపులన్నా తప్పనిసరిగా కాజాలు చేసేవారు. కానీ సాయంత్రం పెళ్ళివారు వస్తారనగా మా అమ్మ "ఇదిగో రెండు రెండు బిస్కట్లు పెట్టి కాఫీలిద్దాం! అంతకన్నా ఎక్కువ హడావిడి వద్దు. మొన్న పెళ్ళి చూపులకి నానా హైరాన పడ్డాం. కుదిరిందా పెట్టిందా! ఇంకా ఎన్ని చూడాలో" అంది. నాకు పిచ్చ కోపం వచ్చేసింది. "అమ్మా! నీకు ఒక్కసారికే విరక్తి వచ్చేసిందా? ఇప్పటికి రమకి ఏడు పెళ్ళిచూపులయ్యాయిట! ఇది కుదిరే సంబంధం. శ్రీశైల మల్లికార్జునుడికి హారతి జరుగుతున్న టైంలో నాకు తెలిసింది, కాబట్టి తప్పకుండా కుదురుతుంది. పల్లెటూరి నుంచి వచ్చిన వాళ్ళు బిస్కట్లు ఏం తింటారు? నీకంత కష్టంగా వుంటే నేనే చేసుకుంటాలే!" అని మధ్యాహ్నం కూచుని కాజాలు, కారప్పూస చేసాను. అయినా నాకు మా అమ్మ మీద కోపం పోలేదు. "అబ్బా! ఇంకా ఆలూ లేదు చూలూ లేదు అప్పుడే దీనికింత పౌరుషం పొడుచుకొచ్చింది" అని అమ్మ విసుక్కుంది.

సరిగ్గా సాయంత్రం ఐదు గంటలకి పెళ్ళి కొడుకు, తన తల్లి, పెత్తల్లి, పినతల్లి, ఒక పురోహితుడు, ముత్తయిదువుతో సహా వచ్చాడు. మా నాన్న అతను మెట్లెక్కుతుండగా చూసి మంచి మేధావి, నుదురు బాగుందని సర్టిఫికెట్ ఇచ్చారు.

నేను "నాన్నా! మీరు నా బంగారు కొండ. ఆవిడ్ని చూడండి కొరివిలా నిలబడి ఎలా చూస్తోందో!" అని మా అమ్మ మీద నా కసి తీర్చుకున్నాను. అందరూ లోపలికి వచ్చి కూర్చున్నాక మంచినీళ్ళిచ్చి, కాజాలూ, కారప్పూసా పెట్టాము. నేనే చేశానని కూడా మా అమ్మ చెప్పలేదు. అబద్ధం ఆడినట్లుంటుందిట. నేను అటూ ఇటూ తిరుగుతూనే వున్నాను. మా ఇందూ, బుజ్జీ, తమ్ముడు మాత్రం కదలకుండా అతని ఎదురుగా కూర్చున్నారు. ఏం చేస్తారు పాపం. అటు ఇటు తిరిగితే వాయించేస్తానని మా అమ్మ వాళ్ళని బెదిరించి ఒక పక్కన కూచోబెట్టింది. పెళ్ళికొడుకు కిటికీలోంచి పక్కింటిని చూస్తూ కూచున్నారు. మానాన్న "ఏదైనా మాట్లాడతారా?" అని అడిగితే అక్కర్లేదన్నారు. నేనే పలకరించాను "మీరు ఏ పని మీద అవనిగడ్డ వచ్చారండీ?" అని. అప్పుడు నోరిప్పారు. "బియ్యం తీసుకెళ్ళడానికండీ! పూనాలో బియ్యం దొరకవు. మా ఫ్రెండ్స్ కోసం" అన్నారు.

ఎన్ని తీసుకెడుతున్నారని అడిగితే... "బస్తాన్నర" అన్నారు.

"పోలీసులు పట్టుకుంటారేమో" అన్నా. "పర్మిట్ వుందండీ!" అని జేబులోంచి కాగితం తీసి చూపించారు.

ఇంతే మా సంభాషణ.

వెంటనే లేచి, బయట తిరగడానికి వెళ్ళిపోయారు. ఇంకా ఏమన్నా ఎంక్వయిరీలు చేస్తాననుకున్నారో ఏమిటో?

అక్కడ కూచున్న వాళ్ళు పాటపాడమన్నారు. సరే అని "చేతహః శ్రీరామం చింతయ జీమూతశ్యామం" పాడాను. ఆరోజుల్లో భక్తిరంజనిలో బాల మురళీగారి గాత్రంలో పది రోజులకోసారయినా వినిపించేది.

శారదాంబగారు నాకు పెళ్ళికొడుకు తల్లిని చూపించి – "ఇదిగో అమ్మాయ్! ఈవిడే మీ అత్తగారు. గంగిగోవులాంటిది. మహా ఉత్తమురాలు. బోలెడు చాకిరీ చేస్తుంది. మీరు బోలెడుమంది పిల్లల్ని కని హాయిగా ఉద్యోగాలు చేసుకుంటూ వుండండి. కానీ ఈవిడ్ని మాత్రం జాగ్రత్తగా చూసుకోండి" అని మాట్లాడ్డం మొదలుపెట్టారు.

అన్నీ వింటున్న చిన్నావిడ మధ్యలో కల్పించుకుని "ఒసే శారదక్కయ్యా! కాస్త నువ్వు మాట్లాడకుండా వుంటావా? అమ్మాయికవన్నీ మనం తరవాత చెప్పచ్చు". అని ఆవిడ వాక్ప్రవాహానికి అడ్డుకట్టవేశారు. షికారెళ్ళిన పెద్దమనిషి తిరిగి వచ్చాక, అందరూ తిరిగి బయల్దేరారు. అసలు సంగతి ఏవిటంటే నా జాతకం, ఫోటో

ఆయనకి పంపగానే "ఈ అమ్మాయి పెద్ద సైంటిస్టు అవుతుంది. పేటెంట్స్ చేసి చాలా డబ్బు గడిస్తుంది. మీరు వెంటనే సంబంధం ఖాయం చేసుకోండి. నేను తనని చూడక్కరలేదు" అని వాళ్ళ పిన్నికి ఉత్తరం రాశారుట. తను చూడక్కరలేదంటే సరిపోదు మా వాళ్ళందరూ చూడాలి కదా! అందుకే ఈ ప్రహసనం. ఆరోజుల్లో పిల్లవాడు ఒప్పుకున్నాక అమ్మాయిలు కాదనడం వుండేది కాదు ఎక్కడో తప్ప. ఆ ధైర్యంతోనే ఆ పెద్దావిడ పెళ్ళిచూపుల్లోనే అప్పగింతలు పెట్టసాగారు. మర్నాడు సాయంత్రానికి వాళ్ళకి సంబంధం ఇష్టమేనని టెలిగ్రాం వచ్చింది.

అంతకు మూడురోజుల ముందు ఈ పెళ్ళికొడుకుని వాళ్ళ మేనమామ విజయవాడ స్టేషన్లో కాపేసి పట్టుకుని తన ఫ్రెండు కూతుర్ని చూపించేందుకు పెళ్ళిచూపులకి తీసుకెళ్ళారట. ఆ అమ్మాయి పి.యు.సి. చదువుకుంది. చిన్నపిల్ల. చాలా చక్కనిది. బాగా డబ్బున్న వాళ్లు. కానీ మన పెళ్ళికొడుకు ఈ సంబంధం అసలు కన్సిడర్ చేయకపోవడానికి కారణం ఆ అమ్మాయి చదువు, నా జాతకం మాత్రమే కాదు. పెళ్ళి చూపుల్లో వాళ్ళు చల్లటి ఇడ్లీల మీద పేరిన నెయ్యివేసి, పక్కన పంచదార వేసి టిఫిన్ వడ్డించారట. అది తీవ్రంగా దెబ్బతీసి మనసు విరిచేసిందిట. తన మేనమామ, పిన్నీ ఆ సంబంధం కుదర్చాలని చాలా ప్రయత్నాలు చేశారు కానీ, వాళ్ళ ప్రయత్నాలు ఫలించలేదు. మా పెళ్ళి చూపులయ్యాక కూడా తనని మేనమామ వదల్లేదు. "ఇంకా తాంబూలాలు తీసుకోలేదు కదా! ఇంకొక్కసారి ఆలోచించు" అని ఉత్తరం రాశారుట. "వెంటనే నువ్వు వెంకటేశ్వరరావు గారి ఇంటికి వెళ్ళి తాంబూలాలు తీసుకుని, వాళ్ళ సంబంధం ఖాయం చేసుకుని నాకు తెలియపరచవలసింది" అని వాళ్ళ మేనల్లుడు జవాబిచ్చాడట.

ఒకరోజు పొద్దున్నే నేను కాలేజీకి బయల్దేరుతుంటే చేతిలో ఒక చిన్న సంచీతో గుమ్మంలో ఒక పెద్దమనిషి ఎదురయ్యారు. లోపలికి రమ్మని ఆహ్వానించాం. ఆయన వచ్చి కూచుని "నేను రంగారావు మేనమామని. మేం గుడివాడలో వుంటాం. రంగారావు తాంబూలాలు తీసుకోమని ఉత్తరం రాశాడు. ఇవాళ పదకొండున్నరకి బాగుందని బ్రాహ్మడు చెప్పాడు. నేను మళ్ళీ రెండుగంటల బస్సుకి వెళ్ళిపోవాలి" అన్నారు.

మా నాన్న అక్కడే కూచుని "దాందేముంది తమలపాకులు, వక్కపొడి మా ఇంట్లో ఎప్పుడూ వుంటాయి. మీరన్నట్లు ఆ ఫార్మాలిటీ పూర్తి చేసేద్దాం. కూచోండి" అన్నారు.

మా అమ్మ బయటకి వచ్చి "ఇంత హఠాత్తుగా చెప్తే ఎలాగండీ! నలుగురికీ

చెప్పుకోవాలి కదా!" అంది.

"ఏం హడావిడి పడకండమ్మా! మనలో మనం మాటగట్టిచేసుకుంటే చాలు."అన్నారు.

మా అమ్మకి ఏం చెయ్యాలో తోచక "సుశీలా! నువ్వు రాంభద్రం మామయ్యగారిని, అత్తయ్యగారిని భోజనానికి రమ్మని చెప్పు. పిల్లల్ని అందర్నీ రమ్మను. సుబ్బమ్మగారు ఎటూ వెళ్ళకుండా వుంటే ఆవిడ్ని వంటకి రమ్మను" అని చెప్పింది. నేను వెంటనే బయల్దేరా! అదృష్టం కొద్దీ మామయ్యగారింకా రేడియో స్టేషనుకి బయల్దేరలేదు. అత్తయ్యగార్ని పిల్లల్ని అందరినీ తీసుకుని మధ్యాహ్నం భోజనానికి రమ్మని పిలిచాను. పదకొండున్నరకి పెళ్ళితాంబూలాలని కూడా చెప్పాను.

"పెళ్ళి చూపులకే బ్రాహ్మడు, ముత్తయిదువుతో సహా ఆరుగురు వచ్చారు. ఈసారి ఎంతమందివచ్చారని" అడిగారు. మేనమామ ఒక్కరే వచ్చారని చెప్పేసరికి ఆశ్చర్యపోయారు. మా అమ్మ ఏ పెట్టెల్లోంచో ఒక పంచెల చాపు, ఒక చీర సంపాదించింది. సరిగ్గా పదకొండున్నరకి మా నాన్న బట్టలు, వాటిమీద తాంబూలం పెట్టి ఆయన చేతుల్లో పెట్టారు. ఆయన తాంబూలం రెండు అరటిపళ్ళు నాన్న చేతికిచ్చారు. మామయ్యగారు కల్పించుకుని "ఎవరైనా వెంకటేశ్వరరావుగారింట్లో ఫలానా రోజున భోజనం ఎందుకు చేశారు అని అడిగితే నన్నేం చెప్పమంటారు" అని అడిగారు. అప్పుడు మా నాన్న కష్టం మీద నోరు విప్పి "మా పెద్దమ్మాయిని మీ మేనల్లుడు రంగారావుకిచ్చి వివాహం చేసేందుకు ఈ తాంబూలం ఇస్తున్నాను" అన్నారు.

ఆయనింకా కష్టపడి "సరే!" అన్నారు.

మా అమ్మ మాత్రం భోజనంలోకి కంద - బచ్చలి కూర, రవ్వప్పాలు చేసి శాస్త్రాన్ని తు.చ. తప్పకుండా పాటించింది. మేనమామగారు హడావిడిగా రెండు మెతుకులు నోట్లో వేసుకుని వెళ్ళిపోయారు. అదీ మా తాంబూలాల కథ.

తాంబూలాలయాక పూణె నుంచి ఉత్తరాల ప్రవాహం మొదలయింది. రోజుకి రెండు ఉత్తరాలు ఒక్కొక్కటి ఐదారు పేజీలవి, చీమల బారులాంటి చేతి వ్రాతతో వచ్చేవి. నేను నాలుగు రోజులకొకసారి ఇన్‌లాండ్ కవర్లో నాలుగు లైన్లు రాసేదాన్ని. డిసెంబర్లో పెళ్ళిచూపులయి, ఫిబ్రవరిలో తాంబూలాలై, మార్చి నుంచి ఉత్తరాలు మొదలై ఏప్రిల్ నుంచి తను వచ్చి పోతున్నా మా నాన్న పెళ్ళి వూసెత్తరు. అక్కడ అవనిగడ్డలో మా అత్తగార్లు కంగారుపడ్డారంటే పడరూ?. "మాకు గవర్నమెంటు

నుంచి బిల్సు రావాలి, వచ్చాక చేస్తాం" అని నాన్న కబురు పెట్టారు. ఓ నెల పోయాక పెళ్ళి కొడుకు మా నాన్నకి అల్టిమేటం ఇచ్చారు. "సెప్టెంబరులో చేస్తే చెయ్యండి, లేకపోతే మేం చేసుకుంటాం" అని

దాంతో ఇంక ఆబోరు దక్కేట్టులేదని మా తాతగారిచేత సెప్టెంబరు తొమ్మిదికి ముహూర్తం పెట్టించారు. పెళ్ళికొడుకు ఆ ముహూర్తం బాగాలేదని, సెప్టెంబరు ఎనిమిది రాత్రి పది ఏభైకి మార్చారు. ఆ రోజు కృష్ణాష్టమి. పెద్దవారైన మా తాతగారు కూడా అతను పెట్టిందే బాగుందని మెచ్చుకున్నారు. ఈలోగా బియస్సీ ఫైనల్ ఇయర్ రిజల్ట్స్ వచ్చాయి. మా కాలేజీ పిల్లలందరూ డెబ్బయిశాతం మార్కులతో పాసయ్యారని తెలిసింది. మా మదర్ ప్రిన్సిపల్ మంచి సంతోషంలో వుండగా నా పెళ్ళి కుదిరిందని చెప్పాను. ఒక్క క్షణం ఆవిడ ముఖం మాడిపోయింది. నాకు కాబోయే ఆయన ఏం చదువుకున్నారో తెలుసుకుని ఆయన అడ్రస్ అడిగింది. కొంపదీసి పెళ్ళి సంబంధం చెడగొడుతుందేమోనని భయం వేసింది. కానీ ఎడ్రస్ ఇచ్చాను. ఆవిడ "ఇక్కడ సుశీల అవసరం చాలా వుంది. సంవత్సరం మధ్యలో మానేస్తే కష్టం. మీకు లయోలా కాలేజీలో జాబ్ ఇప్పిస్తాను, మీ ఇద్దరూ హాయిగా వుద్యోగాలు చేసుకుంటూ ట్యూషన్లు కూడా చెప్పుకోవచ్చు. ఫైనాన్షియల్‌గా చాలా బాగుంటుంది. మీరు ఈవూరు వచ్చే ఆలోచన చేయండి" అని తనకి ఉత్తరం రాసింది. ఆ ఉత్తరాన్ని తను జాగ్రత్తగా కవర్లో పెట్టి నాకు పంపారు. తన రిసెర్చి వర్కు మధ్యలో వదిలిపెట్టిరాలేనని క్షమించమని ఆవిడకి ఉత్తరం రాశారు.

మళ్ళీ కాలేజీలు తెరిచాక ఆవిడ నాతో స్నేహంగానే వుండేది కానీ, సెప్టెంబరు ఆరో తేదీన కూడా కాలేజీ ఫుల్ డే వర్క్ చేయించి కానీ వదలలేదు.

చూస్తుండగానే మగపెళ్ళివారి ఆహ్వానపత్రికలు వచ్చేశాయి. ఆ పత్రికలు మా అత్తగారు సోమరాజు విజయలక్ష్మమ్మగారు తన కుమారుని వివాహానికి ఆహ్వానించినట్లు వేశారు. ఆరోజుల్లో అది సంచలనమే. మా ఇంట్లో పెళ్ళి ఏర్పాట్లు మా అమ్మ ఏం చేయించిందో నాకు గుర్తులేదు కానీ, పెళ్ళి మాత్రం ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్‌లో జరగాలని పట్టుబట్టింది నేనే. మా అమ్మకి దుర్గగుడి దగ్గర వున్న కన్యకాపరమేశ్వరి సత్రంలో చేయాలని వుండేది. కానీ, అదేమిటో చీకటి చీకటిగా వుండి నాకు నచ్చలేదు. నాకు ఒక జత గాజులు, గొలుసు వున్నాయి కాబట్టి మేము అసలు బంగారం కొట్టు వేపుకు వెళ్ళలేదు. అలాగే చీర కూడా మా అమ్మ మూడేళ్ళ క్రితమే కంచిచీరల వాళ్ళ దగ్గర కొనిపెట్టింది. ఒక చీర చాల్లే, మిగతావి ఎలాగూ ఎవరో ఒకరు తెస్తారు. లేకపోతే అప్పుడు రెండోది కొందాం అంది. ఆవిడ

అనుకున్నట్లుగానే మా రాజన్నయ్య ఢిల్లీ నుంచి వస్తూ అందమైన లేత గులాబీ రంగు వెండి జరీ బోర్డరు వున్న బెనారస్ చీర తెచ్చాడు. జర్మనీలో వున్న మా బుల్లెన్నయ్య తను పారిస్ వెళ్ళినప్పుడు కొన్న మంచి పెర్ఫ్యూమ్స్ నాకోసం పంపాడు. కానీ నేనొక పిచ్చిదాన్ని. మా బాబాయి వచ్చి నన్నడిగితే తీసుకో బాబాయి నాకు సెంటువాసన పడదు అని ఇచ్చేశాను. తరవాత అందరి చేతా పిచ్చితిట్లు తిన్నాననుకోండి. ఏ వస్తువైనా విలువ తెలియని వాళ్ళ చేతిలో పడితే అంతే కదా!

నాకు 'వి' షేపులో వుండే ఒక ప్రధానపు వుంగరం కొనుక్కోవాలని కోరిక. నేను ఎంత గోల పెట్టినా మా అమ్మ వప్పుకోదే. నేను లోపల అమ్మతో దానికోసం ఘర్షణ పడుతుంటే వరండాలో నాకోసం ఎదురు చూస్తున్న నా స్టూడెంట్ అన్నపూర్ణ అనే అమ్మాయి విని నాకు ఆ వుంగరం కొనిపెట్టింది. తను బయోలాజికల్ ఈవాన్స్ ఛైర్మన్ రాజుగారి అమ్మాయి. అచ్చమైన మహరాణీలా వుండేది. అప్పటికే తను ఇద్దరు పిల్లల తల్లి. చాలా బాగా చదివేది. రాజుల ఇళ్ళల్లో చిన్నప్పుడే పెళ్ళిళ్ళు అయిపోతాయి కదా!

చల్లావారింట్లో అన్ని పెళ్ళిళ్ళకి వంటలు చేసే నారాయణరావుని మా ఇంట్లో పెళ్ళి వంటకి పిల్చింది మా అమ్మ. అతను ఒక స్పెన్సర్ వంటవాడు. ఏ పెళ్ళిలోనూ ఎవరూ తలపెట్టని ఐటమ్స్ చేస్తాననేనాడు. పెళ్ళి రాత్రి డిన్నరుకి జాంగ్రీలు, ఆవడలు, బాదంఖీర్, చేమగడ్డల వేపుడు, అవియల్, మైసూర్ రసం లాంటి ఆరోజుల్లో ఎవ్వరూ సాహసం చెయ్యని వంటలన్నీ చేశాడు. ఇక పెళ్ళివారంతా మురిసిపోయారు. బుద్ధిలేక నేను క్లాసుకి ఒకటి చొప్పున మా కాలేజీలో ఇన్విటేషన్ కార్డులిచ్చాను. మా ప్రిన్సిపల్ హాస్టల్ మెస్ మూయించి లయోలా నుంచి రెండు ఎక్స్ట్రాబస్సులేయించి పిల్లలందరినీ పంపింది పెళ్ళికి. అసలే నా మీద కోపంగా వుంది కదా!

అందమైన కాలేజి అమ్మాయిలతో పెళ్ళిపందిరి మెరిసిపోయింది. అందులో ఆ పెళ్ళికి వచ్చిన అమ్మాయిలలో సామాన్య కుటుంబాల వాళ్ళు తక్కువ. రకరకాల టిష్యూలు, జార్జెట్లు ధరించి విలువైన సొమ్ములు పెట్టుకుని వయసులో ఉన్న అందగత్తెలు తిరుగుతుంటే ఆ పందిరికి వేరే అలంకారాలెందుకు. అసలు ఏ పెళ్ళికయినా మూడువందలమంది కాలేజీ అమ్మాయిలు వస్తారా? ఫోటోలు తీస్తానని మా అమ్మకి చెప్పిన కుర్రాడు పెళ్ళికొచ్చిన అమ్మాయిలకి ఫోటోలు తీయడంలో బిజీ అయి మా సంగతి మర్చిపోయాడు. దాంతే మాకు పెళ్ళిఫోటో అనేది లేదు. చక్కగా వరసగా కూర్చుని భోజనాలు చేసి, పెళ్ళి పూర్తిగా చూసి వెళ్ళారు. యధాప్రకారం వంటలన్నీ ముందుగానే అయిపోయాయి. కానీ అక్కడున్నది నారాయణరావు కదా!

ఏమీ తేడా కనబడనీయలేదు.

మా ఇంట్లో నేను పెద్దపిల్లనని మా వైపు, ఒక్కగానొక్క కొడుకు తండ్రిలేని పిల్లవాడి పెళ్ళి అని వాళ్ళవైపు మొత్తం బంధువర్గమంతా వచ్చారు. నాలుగు పూటల భోజనాలు. పెళ్ళి మర్నాడు శుక్రవారం అవడంతో ఆ ఘడియలన్నీ వెళ్ళేవరకు ఆగవలసి వచ్చింది. ఇన్ని ఏర్పాట్లు జాగ్రత్తగా చేసిన మా అమ్మ ఫోటోల దగ్గర పిసినారితనానికి పోయి మాట్లాడడానికి వచ్చిన ఫోటోగ్రాఫర్ని వెళ్ళగొట్టింది. మావాడొకడు కొత్తగా కెమేరా కొనుక్కున్నాడు, వాడు తీస్తాడులే అంది. పెళ్ళిళ్ళలో దేనికోసం కొంచెం ఖర్చుకు వెనకాడతామో అది తప్పకుండా దెబ్బ కొడుతుంది. తలంబ్రాలు అయ్యేటప్పటికి పన్నెండు దాటింది. హోమాలు చేయించేయాలని బ్రాహ్మడు త్వరపడ్డాడు. పెళ్ళికొడుకు చిరాగ్గా ముఖం పెట్టి "ఇప్పుడేం హోమాలు రేపంతా ఏం చేస్తారు. పొద్దున్నే రండి" అని బ్రాహ్మడికి చెప్పి వాళ్ళ పిన్నిచేత ఆ హాల్లోనే ఒక పక్కగా మడతమంచం దిండు వేయించుకుని పెద్ద దుప్పటీ ముసుగెట్టి క్షణంలో నిద్రపోయారు. ఆ బ్రాహ్మడు విస్తుపోయి అలా చూస్తూ

"అమ్మా! అబ్బాయికి ఈ పెళ్ళి పూర్తిగా అంగీకారమేనా!" అనిఅడిగారు.

"అంగీకారమే నాయనా! ఇద్దరూ మంచి స్నేహితులు. కాకపోతే కాస్త కోపధారివాడు" అని ఆయనకి ధైర్యం చెప్పింది. మాట్లాడకుండా తన ముటానేసుకుని వెళ్ళిపోయాడు మర్నాడు పొద్దున్నే తొమ్మిగంటలకు వస్తానని. ఈయన జాతకబలం ఏమిటో ఎంతటి వాళ్ళనైనా అటెన్షన్‌లో నిలబెట్టేవారు.

పెళ్ళిరోజు పొద్దున్న స్నాతకం అవుతుండగా ఇద్దరు తాతగార్లూ, అంటే మా అమ్మ వాళ్ళ నాన్న, మా నాన్నా వాళ్ళ బాబాయి ముందు వరసలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇంతలోకే ఒకాయన ఎవరో వచ్చి మా తాతగారిని "తమరెవరో తెలుసుకోవచ్చా" అని మర్యాదగా అడిగాడు.

మాతాతగారు "నిరభ్యంతరంగా తెలుసుకోండి! నేను పెళ్ళికూతురి తాతగారిని" అని చెప్పారు.

ఆయన కొంచెం సణుగుతూ "ఆయనెప్పుడో పోయారని విన్నానే" అన్నాడు.

అప్పుడు మాతాతగారు "నిజమే! పోయాను. కానీ మనవరాలి పెళ్ళని దిగివచ్చాను" అని చెప్పి సీరియస్‌గా స్నాతకం చూస్తూ కూర్చునేసరికి. ప్రశ్నవేసినాయన బుర్రగోక్కుంటూ వెళ్ళిపోయాడు.

స్నాతకం అయ్యాక మా వాళ్ళు భోజనాల ఏర్పాట్లు చేస్తుండగా ఒకావిడ మా పిన్ని దగ్గిరకి వెళ్ళి – "పెళ్ళికొడుక్కి నీరసంగా వుందిట. గ్లాసు బత్తాయి రసం తెమ్మన్నాడు" అని అడిగింది.

మా వాళ్ళందరూ హడావిడి పడిపోయి బత్తాయికాయలు తెప్పించి రసం తీసి ఇచ్చారు. ఇంకో అరగంటలో మళ్ళీ అలాగే అడిగి ఇంకో గ్లాసుడు రసం తీసుకెళ్ళింది. పది నిమిషాల్లో మళ్ళీ వచ్చి మళ్ళీ రసం అడిగింది. ఏమయింది ఈ నీరసాలేమిటి అని కంగారు పడ్డారు.

మా వాళ్ళు మా పిన్నత్తగారి దగ్గిరకెళ్ళి "ఏమండీ అబ్బాయికి వంట్లో బాగోలేదా అన్నిసార్లు బత్తాయిరసం తాగుతున్నాడు" అని కనుక్కున్నారు.

"బాగానే వున్నాడే! ఫ్రెండ్స్‌తో ఛెస్ ఆడుతున్నాడు. చూసి వస్తాను ఉండండి" అని తిరిగి వచ్చి, "మిమ్మల్ని ఎవరు అడిగారు" అన్నారు.

"ఆవిడెవరో పెద్దావిడ చెంగావిరంగు పంచెకట్టుకుంది" అని చెప్పారు.

"అయ్యో! అదా! అదో పిచ్చిది! మా ఇంట్లో తిరుగుతూ వుంటుంది. తీరా బస్సు బయల్దేరే సమయానికి తనూ వస్తానని ఏడిస్తే వెంటేసుకుని వచ్చాం. ఉండండి ఎక్కడుందో చూస్తా"నని వెళ్ళారు.

వాకిట్లో ఆడుకుంటున్న పిల్లల్ని ఒక్కొక్కళ్ళనే నోరు తెరవమని బలవంతాన వాళ్ళ నోట్లో రసం పోస్తోంది నీరసాలొస్తాయర్రా అంటూ. అందరం నవ్వుకుని వూరుకున్నాం.

ఆవిడే మళ్ళీ రాత్రి పెళ్ళాయ్యాక అందరం మంచి నిద్దట్లో వుండగా వాకిట్లో నిద్రపోతున్న సన్నాయి వాళ్ళని లేపి "వాయించండి, వాయించండి పెళ్ళికొడుక్కి మంగళస్నానం చేయించాలి" అనేటప్పటికి ఆ నిద్రకళ్ళతో వాళ్ళు ముందూ వెనకా చూసుకోకుండా భయ్యిమని వాయిద్యం మొదలుపెట్టారు. మళ్ళీ అందరూ లబోదిబోమని పరుగెత్తుకెళ్ళి అర్థరాత్రి మంగళస్నానాలేమిటని వాళ్ళ నోళ్ళు మూయించారు.

తెల్లవారి హోమాలు శాస్త్రప్రకారంగా అయి భోజనాలు చేస్తున్నప్పుడు మా ఇంటి అడ్రస్‌కి ఢిల్లీ నుంచి రిజిస్టర్ పోస్టు వచ్చిందని ఎవరో వచ్చి నా చేతికి కవరు ఇచ్చారు. అది నాకు సి.ఎస్.ఐ.ఆర్. వాళ్ళు స్కాలర్‌షిప్ ఇస్తున్నట్లు వెంటనే పూనాలోని నేషనల్ కెమికల్ లేబరేటరీలో జాయిన్ అవ్వమని రాసిన వుత్తరం. "చూశావా! నీకు ప్రభుత్వం వాళ్ళు పెళ్ళి బహుమతి పంపార"ని అందరూ సంతోషించారు.

ఇంక పెళ్ళి లక్షణంగా జరిగింది. కాబట్టి మర్నాడు అందరూ తీరుబడిగా లేచి కబుర్లు చెప్పుకుంటున్నారు. అసలు మా సంబంధం కుదిరిందన్నపుడు వాళ్ళ బంధువుల్లో ఒకరు "అమ్మో! గోదావరిజిల్లా సంబంధమా! వాళ్ళు తడి గుడ్డలతో గొంతులు కోస్తారు" అన్నారుట. అది తనకి చాలా కష్టం తోచింది. ఆమాట అన్నాయనే "ఆడపెళ్ళివారేం చేస్తున్నారు" అని ఆరా తీయబోతే ఈయన బట్టలు జాడిస్తున్నారని చెప్పారు. "ఓర్నీ! నీకెంత కోపం వచ్చిందిరా మీ అత్తార్ని అన్నానని చెప్పి నవ్వుకున్నారుట. నాకు పెట్టవలసిన చీరలు విజయవాడలో కొందామని వాళ్ళు అనుకుని ఏమీ తేకుండా వచ్చారు. ఆ రోజు విజయవాడ బంద్ అవడంతో చీరలు కొనలేకపోయారు. దానితో అన్నిటికీ ఒకటే చీర తిప్పాల్సి వచ్చింది. మేము ఏ కట్నాలూ ఇవ్వలేదు కాబట్టి వాళ్ళు ఏ నగలూ పెట్టలేదు. మధ్యాహ్నం మా ప్రిన్సిపాల్ నలుగురు సిస్టర్స్‌తో కలిసి వచ్చి నాకొక బెడ్ షీట్ సెట్ బహుమ తి ఇచ్చింది. అది వాళ్ళ ఆచారంట. మధ్యాహ్నం భోజనాలయాక చాలామంది పెళ్ళివారు ఆ మర్యాదల ముసలమ్మతో సహా బస్సులో అవనిగడ్డ వెళ్ళిపోయారు.

భోజనాలయ్యాక ఇక చేసే పనేమీ లేక ఇక మిగిలిన వారంతా కలిసి పేకాట ఆడుకుంటున్నారు. నేనక్కడ కుర్చీలో కూర్చుని చూస్తున్నా. నా పక్కన మా అమాయకపు మహారాజు మా పెద్దత్తగారు కూర్చుని వున్నారు. మా ఆయన వరుసగా రెండు షోలు చెయ్యడంతో చాలా డబ్బు వచ్చింది. గబుక్కున లేచి ఆ డబ్బులన్నీ నాకిచ్చారు. చూసి సంతోషం పట్టలేని మా పెద్దత్తగారు "ఇదిగో అమ్మాయ్! రేపటి నుంచి మా వాడు బోలెడు డబ్బు సంపాయించి ఇట్టాగే నీ చేతిలో పోస్తాడు" అన్నారు.

నేను ఊరుకోవచ్చుగా. "పేకలాడా?" అన్నాను. తర్వాత నాలిక్కరుచు కున్నాననుకోండి.

రాత్రి పన్నెండు దాటాక అప్పగింతలని అన్నారు. కానీ నేను ఒప్పుకోలేదు. నన్నెవరికీ అప్పచెప్పక్కర్లేదన్నాను. అప్పగింతలవగానే అందరికీ ఏడుపులొచ్చేస్తాయి. ఇంత బాగా జరిగిన పెళ్ళి మూడంతా పాడయిపోతుంది. అందుకే నాకు ఆ తంతు అంటేనే ఇష్టం వుండేదికాదు. ఇంతలోకి మా చిన్నత్తగారు వచ్చి "పది వూళ్ళు ఏలేలా వుంది ఈ అమ్మాయి. తనని మా అమాయకపు అక్కకి అప్పచెప్పేదేమిటి? ఆవిడ్నే ఈ అమ్మాయికి అప్పచెప్పండి ప్రేమగా చూసుకోమని" అన్నారు. దాంతో అప్పగింతలు కార్యక్రమం కాన్సిల్ అయింది. ఆ తంతు జరిపించడానికి ఆవలించుకుంటూ వచ్చిన కుర్రబ్రాహ్మడు బ్రతుకుజీవుడా అని సైకిలెక్కి పారిపోయాడు.

మా వాళ్ళది హెడ్ క్వార్టర్సు అవనిగడ్డే అయినా పిల్లల చదువులకోసం వాళ్ళకే

వూళ్ళో సీటొస్తే ఆ వూళ్ళో కాపరం పెట్టి చదివించేవారు. ఎవరినీ హాస్టల్లో వుంచేవారుకాదు. లలితత్తయ్యగారు ప్రభాకర్ మెడిసిన్ చదువు కోసం వరంగల్‌లోను, మా అత్తగారు చందు చదువుకోసం హైదరాబాదులోను వుండేవారు. మా ఆయన తన ఉద్యోగానికి ఒక్క పదిరోజులు మాత్రమే సెలవు పెట్టి రావడం వల్ల అవనిగడ్డ వెళ్ళడం కష్టమౌతుందని వ్రతం వరంగల్లులో పెట్టుకున్నారు. బంధువులందర్నీ ఎటూ మధ్యాహ్నమే అవనిగడ్డ పంపేశారు కదా! మిగిలిన పెళ్ళివారందరం రాత్రి ఒంటిగంటకి బయల్దేరి స్టేషనుకు వెళ్ళి తెల్లవారేటప్పటికి వరంగల్ చేరాం.

వరంగల్ చేరేటప్పటి ఎనిమిది గంటలయింది. ప్రభాకర్‌తో బాటు వీళ్ళ బంధువుల్లో చాలామంది పిల్లలు ఆ కాలేజీలోనే చదువుకునేవారు. ఆరోజుల్లో అదొక్కటే డొనేషన్ కాలేజి. పేరుకి హాస్టల్ వున్నా ఎక్కువగా అందరూ వీళ్ళింట్లోనే భోజనాలు. ప్రభాకర్‌ని హెూటల్‌కి వెళ్ళి ఒక ఏభైమందికి సరిపడా ఇడ్లీలు తెమ్మని పంపారు. అతను యాభై ఇడ్లీ పొట్లాలు కట్టించుకు వచ్చాడు. అదేమిటి ఎవరిది వాళ్ళకి విడివిడిగా తెచ్చావ్ అంటే, "కలిపి తెస్తే పచ్చడి కోసం యుద్ధాలయిపోతాయి వదినా!" అని ధర్మసూక్ష్మం చెప్పాడు.

మర్నాడు వ్రతం, భోజనాలు, పన్నెండున్నరకి రామప్ప దేవాలయానికి విహారయాత్ర అని ఇరుగు, పొరుగు అందరికీ చెప్పారు. రెండు బస్సులు కూడా ఏర్పాటు చేశారు. నూట యాభైమంది భోజనాలకి అవుతారనుకున్నాం. ఆ వూళ్ళో వీళ్ళకి ఎక్కువ బంధువర్గం లేదు. ఈ చదువుకుంటున్న పిల్లలు తప్ప. పోనీ పరిచయాలు కూడా లేవు. తెల్లవారకట్లే వచ్చి వంట మొదలు పెట్టవలసిన వంటాయన దుమ్మా కొట్టేశాడు. ఇంత కూడా నదురూ బెదురూ లేకుండా మా అత్తగార్ల తల్లి, ఎనభై ఏళ్ళ ఆవిడ మడి కట్టుకుని కూతుళ్ళ సాయంతో తొమ్మిదిగంటలకల్లా వంట పూర్తిచేశారు. నాకు సత్యన్నారాయణ ప్రసాదం చెయ్యడం బాగా వచ్చని చెప్పి వాళ్ళనడిగి వేరే స్టౌవ్ మీద చేశాను. మా అత్తగార్లందరూ మురిసిపోయారు. ఇక్కడి బ్రాహ్మడు సత్యనారాయణ కథ తెలంగాణా తెలుగులో చెప్తుంటే మాకు చాలా విచిత్రంగా అనిపించింది. సరిగ్గా వంటిగంటకల్లా అందరి భోజనాలు అయిపోయాయి. అందరం రామప్ప గుడికి బయల్దేరాం. వరంగల్ నుంచి సుమారు నలభై కిలోమీటర్ల దూరంలో ఈ రామప్ప దేవాలయం వుంది. అక్కడ కొలువైన దేవుడు శివుడు. ఆ అద్భుతమైన కళా సంపదని తీర్చిదిద్దిన శిల్పిరామప్ప. శిల్పిరామప్ప పేరుతో పిలువబడే ఆ దేవాలయం అదొక్కటే అనుకుంట. ఆ లోపల ఎంత అందంగా వుందో చెప్పలేను. పైగా మాతో వచ్చినవారందరూ కాలేజీ పిల్లలే.

ఇంక ఆనందానికి, లోటేం వుంటుంది. ఏమయినా మా పెళ్ళి వేడుకలలో ప్రధానపాత్ర యువశక్తిదే. వుత్సాహవంతులు కొందరు వన విహారం చేయబోతే తేనెటీగలు వెంటబడ్డాయి. అక్కడ మనుష్య సంచారం అంత వుండదు కాదు కదా! తేనెటీగలు డిస్టర్బ్ అయినట్టున్నాయి.

వరంగల్లో వున్న నాలుగు రోజుల్లో నాకు తెలిసిందేమిటంటే మా అత్తగార్లు అందరూ అపర అన్నపూర్ణలని అందరికీ అన్నాలు పెట్టడమే వాళ్ళకి ఆనందమని, డబ్బు ఖర్చుకి కానీ, దేహశ్రమకి కానీ వెరవరని! కూతుళ్ళు లేని వాళ్ళు నన్నేనాడూ కోడలిగా చూడలేదు. నాతోబాటు నా చెల్లెళ్ళని కూడా చివరివరకు తమ పిల్లలుగానే భావించారు. పెళ్ళి మనుగుడుపులకని వచ్చిన మా చెల్లెళ్ళకి మా ఆయన తను బొంబాయిలో ప్రత్యేకంగా సెలక్ట్ చేసి తెచ్చిన బాంబేడైయింగ్ చీరలు ఇచ్చారు. మా తమ్ముడికి మంచి డ్రెస్ మెటరియల్ పెట్టారు. మా పిన్నికి కూడా చాలా మంచి జరీచీర కొన్నారు. ఆవిడ విజయవాడ వచ్చాక మా అత్తవారిల్లు గురించి బ్రహ్మాండమైన రిపోర్టు ఇచ్చింది.

అక్కడో నాలుగు రోజులు, అమ్మ దగ్గరో నాలుగు రోజులు వుండేటప్పటికి పూణె వెళ్ళవలసిన రోజు రానే వచ్చింది. పెళ్ళిలో మా అత్తగారు పెట్టవలసిన చీరలు అప్పుడు కొనుక్కున్నాను. అయిదువందలకి అయిదు. మైసూర్ సిల్క్, కంచి ధర్మవరం, అలా తలావకటి ఏ జరీలు లేకుండా చాలా అందంగా వుండేవి. తన దగ్గిర చాలా వంట సామాన్లున్నాయని అబద్ధాలు చెప్పి మా అమ్మ నాకోసం చిన్నప్పటి నుంచి కొని వుంచిన స్టీలు సామాన్లు డబ్బాలు, కారియర్లు ఏవీ ఈయన తీసుకోనివ్వలేదు. నాతోబాటు వచ్చినది నా బట్టల పెట్టి, పుస్తకాల పెట్టి మాత్రమే. నేను చాలా సంతోషంగా సామాన్లు సద్దుకుని బయల్దేరుతుంటే గుమ్మం దగ్గిర నిలబడ్డ అమ్మతో మా నాన్న "అది అలా వెళ్ళిపోతోందేమిటే! ఏదో ఫ్రెండ్స్‌తో పిక్నిక్‌కి వెళ్తున్నట్లు! ఇంత కూడా మనమీద బెంగలేదా?" అని గబుక్కున కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారుట. నాకేమిటో ఇంకొక కొత్త బంధం చేరిందన్న ఆనందమే కానీ ఉన్న బంధాలు దూరమవుతాయన్న ఆలోచనే లేదు. వాస్తవానికి కూడా భగవంతుని కరుణ వల్ల నాకెప్పుడూ నా పుట్టింటివారు దూరమవలేదు.

విజయవాడకి వీడ్కోలు చెప్పి తెల్లవారేటప్పటికి హైదరాబాదు చేరాం. ఆరోజు వినాయక చవితి. అప్పటికి మా అత్తగార్లు, అమ్మమ్మగారు అందరూ హైదరాబాదు చేరారు మా ప్రయాణం ఏర్పాట్లు చూడటానికి. వినాయక చవితి పూజ, భోజనాలు అయ్యాయి. అప్పుడు అమ్మమ్మగారు నాతో "వాడికి నిప్పులమీద కాల్చిన అప్పడాలంటే

ఇష్టం. అది లేనిదే అన్నం తినడు. నేను అవనిగడ్డ నుంచి చిన్న కుంపటి తెచ్చాను. కాస్త రోజూ రెండపూడాలు కాల్చిపెట్టమ్మా!" అని ఒక కుంపటి ఇచ్చారు. అలాగే మనవడికి శని, ఆదివారాలలో నాలుగు గింజలు రుబ్బి వేడిగా రెండు గారెముక్కలు వేసి పెట్టమని బుల్లి రోలు ఇచ్చారు. మా అమ్మ కష్టపడి నా చిన్నప్పటి నుంచి పోగుచేసిన స్టీల్ సామాన్లని తెచ్చుకోనియ్యలేదు కానీ, రుబ్బురోళ్ళు, కంపట్లు అమ్మమ్మగారు ఇస్తూంటే తను చూస్తూ వూరుకున్నారు. ఇక వడియాలు, అప్పడాలు గోంగూర, చింతచిగురు ఒకటేమిటి సమస్తం పాక్ చేశారు. ఆవిడ "అమ్మా! మావాడు ధర్మరాజు, బుద్ధికి బృహస్పతి కానీ కొంచెం ప్రథమ కోపం. నువ్వేమీ భయపడకు" అని నాతో చెప్పి "ఒరేయ్ రంగా వాళ్ళవాళ్ళనందరినీ వదులుకుని వచ్చింది. ఊరికే కోపగించుకోకు, బెంగపెట్టుకోగలదు" అని ఈయనకి చెప్పారు.

"మీమీదయితే కోప్పడతా కానీ, తననెందుకంటానే?" అన్నారు.

అక్కడే వున్న మా లలితత్తయ్యగారు "నా తండ్రే ప్రపంచంలో వున్న మాట చెప్పావురా!" అని మెచ్చుకున్నారు.

మా అమ్మా వాళ్ళు ఏ అప్పగింతలూ పెట్టకపోయినా, మా అత్తగార్లు మాత్రం చాలా అప్పగింతలు పెట్టారు. ఈయన కోపానికి నేను దడుసుకుని పారిపోతానేమోనని భయం. ఇంతమంది ఇన్ని మాట్లాడినా మా అత్తగారు మాత్రం నిశ్శబ్దంగా ఎటో తిరిగి కూర్చున్నారు. నే దగ్గిరికెళ్ళి చూస్తే కళ్ళనిండా నీళ్ళు. కళ్ళు ఎర్రబడి వున్నాయి. నాకు కూడా అప్పుడు చాలా ఏడుపు వచ్చింది. అమ్మని వదిలి వచ్చినప్పుడు రాని దుఃఖం ఆవిడని చూసి వచ్చింది. "అత్తయ్యగారూ మీరు బాధపడకండి మనకి క్వార్టర్ దొరగ్గానే మీరు వచ్చేద్దురుగాని" అని ఆవిడకి ధైర్యం చెప్పాను.

రాత్రి తొమ్మిది గంటలకి మేము బొంబాయి వెళ్ళే రైలెక్కి పొద్దున్న పది గంటలకి పూణెలో దిగాలి. ఫస్టుక్లాసులో కూపే రిజర్వు చేయించమని తన స్నేహితుడికి డబ్బు పంపానని, అతను స్టేషనుకు వచ్చి టిక్కెట్లు ఇస్తాడని చెప్పారు. కలల్లో తేలిపోతూ స్టేషన్ చేరాను. చాలామంది మా వాళ్ళు స్టేషన్‌కు వచ్చారు. అది హజ్ యాత్రా సమయం. నాంపల్లి స్టేషనంతా గులాబీపువ్వుల ఘుమఘుమలతో గుబాళించిపోతోంది. ఈయన ఫ్రెండు వచ్చి రెండు థర్డ్ క్లాసు టిక్కెట్లు చేతిలో పెట్టాడు. మా ఆయనకి మామూలు బోగీలో, నాకు ఆడవాళ్ళ బోగీలో రిజర్వేషన్. అతను ముస్లింల కుర్రాడు పైగా ఈయన స్టూడెంటు. ఆడవాళ్ళని మగవాళ్ళ పెట్టెలో ఎలా కూచోబెడతాడు? ఇంత ఆలోచించాడన్నమాట పాపం! జరిగిందేమిటంటే మేము పంపిన డబ్బు వాళ్ళ నాన్నగారికి హఠాత్తుగా గుండెనొప్పి వస్తే వైద్యానికి

ఖర్చయిపోయిందిట. అందుకని ఈ టిక్కెట్లు కొన్నాడుట. ఏం చేస్తాం! నన్ను ఆడవాళ్ళ పెట్టెలో మేం తెచ్చుకున్న పధ్నాలుగు సామాన్లతో సహా ఎక్కించారు. ఆ పెట్టెనిండా వయసు మళ్ళిన స్త్రీలు. హజ్ యాత్రీకులు. మా ఆయన "పూణె పదింపావుకి వస్తుంది అక్కడ కలుస్తానని" చెప్పి వెళ్ళిపోయారు.

ఆ ఆడవాళ్ళందరూ నన్ను చూడగానే "ఆవ్ బేటీ" అని ప్రేమగా పలకరించారు. నేను తెచ్చిన సామాన్లన్నీ సర్దిపెట్టారు. వాళ్ళు తెచ్చుకున్న భోజనం పెట్టబోయారు కానీ, నేను భోంచేసి వచ్చాననడంతో కాసిని పళ్ళు ఇచ్చారు. చాలా స్నేహంగా వున్నారు. అదొక్కటే వూరట. పరిసరాలలో ప్రశాంతత వుంటే ఎటువంటి సమస్యనైనా ఎదుర్కోవచ్చు. అందులో వాళ్ళు దైవదర్శనానికి వెళుతున్నారేమో చాలా నియమనిష్టలతో వున్నారు. పొద్దున్నే లేచి ఏవో ప్రార్థనలు చేసుకున్నారు. పూణె రాగానే నాకన్నా ముందు ఇద్దరు దిగి నా సామానంతా కిందకి దింపి పెట్టారు. 'ఖుదా హఫీజ్' అంటూండగా రైలు కదిలిపోయింది.

నేను సామాన్లన్నీ లెక్క చూసుకుని ఓ పక్కన కూచునుండగా పది నిమిషాల తర్వాత ఈయన వచ్చారు. బయటకు వచ్చి మూడు ఆటోలు మాట్లాడుకుని సామాన్లన్నీ ఎక్కించి మూడో ఆటో భారం దేవుడి మీద వేసి బయల్దేరాం. మేం వెడుతున్నది నేషనల్ కెమికల్ లాబరేటరీని ఆనుకుని వున్న స్టాఫ్ కాలనీ. కాలనీకి వెడుతుంటే లాబ్ సైడ్ గేటు కనపడింది. మా ఆయన ఆటోలు మూడూ పక్కన ఆపించి వాచ్‌మెన్‌ని చూస్తూ వుండమని చెప్పారు.

"పద లాబ్‌లోకి వెళ్ళి జాయినింగ్ రిపోర్టు ఇద్దువుగాని పన్నెండు దాటితే టైం బాగోలేదు" అన్నారు.

"ఈ అవతారంలోనా? ఇంకా స్నానం కూడా చెయ్యలేదు. తెల్లవారి కాఫీ అయినా తాగలేదు" అన్నాను.

"ఏం ఫర్వాలేదు బాగానే వున్నావు. ఇక్కడ ఎవరూ ఏమీ పట్టించుకోరు పద" అని గబగబా నడుస్తూ ముందుకెళ్ళారు. ఏం చేస్తానూ అలాగే అనుసరించాను ఎవరినైనా ఏమైనా అనుకోనీ" అనుకుంటూ. ఎదురుగా లాబొరేటరీ యొక్క పెద్ద భవనం చూసేసరికి నాకు కళ్ళు తిరిగాయి. ఏమి అందం! ఏమి రాజసం! ఇక్కడా నేను పనిచెయ్యబోతున్నది. ఇక్కడా నేను నా భవిష్యత్తును తీర్చిదిద్దుకునేది! అన్న ఆనందంతో అలా వుండిపోయాను. మా ఆయన మళ్ళీ వెనక్కి వచ్చి నన్ను గబగబా లాక్కుని తీసుకుపోయారు. నాకసలు ఆ వరండాలలో నడిచేందుకు కూడా భయం

వేసింది. అక్కడా అక్కడా ఎవరిలోకంలో వారు వున్న మనుషులయితే కనిపించారు గానీ మమ్మల్నెవరూ గమనించలేదు. నేను పనిచెయ్యబోయే డిపార్టుమెంటు మూడో అంతస్తు. నేనెవరి దగ్గరయితే రీసెర్చి చెయ్యాలో ఆయన వరండాలోనే ఎవరితోనో మాట్లాడుతూ కనపడ్డారు. లైబ్రరీనుండి వస్తున్నట్లున్నారు. చేతిలో పెద్ద పెద్ద పుస్తకాలున్నాయి. మమ్మల్ని చూస్తూనే "ఓ యూ ఆర్ హియర్" అని నన్నెప్పటినుంచో తెలిసిన వాడిలాగా "మిసెస్ రావ్ ప్లీజ్ గో త్రూ ద థర్డ్ ఛాప్టర్ పేజెస్, 208-270. వి విల్ డిస్కస్ టుమారో ఎట్ టెన్ థర్డీ షార్ప్" అని నాతో చెప్పి వెళ్ళిపోయారు.

హతోస్మి! నాకూ మా ఆయనకీ తగ్గ గైడ్ దొరికాడు. అదండీ మా పెళ్ళికథలో మరో అధ్యాయం. ఆ తరువాత ఎన్నో ఆధ్యాయాలు, ఒడిదుడుకులు, కొత్తప్రయోగాలు - అందరి జీవితాల్లాగానే వైకుంఠపాళీ ఆట. యాభై ఏళ్ల దాంపత్య జీవితంలో ఎన్నో మధురానుభుతులు, చిరుచేదు జ్ఞాపకాలు. మొత్తం మీద బాలెన్స్‌షీటు నిండుగా పండింది. గడిగడిలో మావెంట వుండి నడిపించిన ఆ దేవదేవునికి మేం ఉభయులం శిరసువంచి నమస్కరిస్తున్నాం.

✤